



పాఠశాలకు తరలిస్తున్న బియ్యం

టి-నేతన్న యాప్‌పై చేనేత కార్మికులకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన టి-నేతన్న యాప్‌పై చేనేత కార్మికులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో టి-నేతన్న యాప్‌పై చేనేత మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులకు



నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత, పవర్‌లూమ్ కార్మికుల కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల రాయితీలను సద్వినియోగం చేసుకునేందుకు ఈ యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన టవల్స్, కర్టన్స్ వంటి వాటిని జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో వినియో గించనున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులు తయారు చేసే ఉత్ప త్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వి అశోక్‌రావు, ఏడీ ఎస్ఎస్ చరణ్, డీఎంవో టెస్కో వెంకటేశ్వర్లు, సత్య నారాయణ పాల్గొన్నారు.

● ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు

జిల్లాలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేలా సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు, బీఎల్ఎలతో బూత్ స్థాయి సమావేశాలను నిర్వహిస్తామని లెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. యువ, క్రియాశీల ఓటర్లతో వాక్ టు పోలింగ్ బూత్ కార్యక్రమాలు, పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకునేలా, ఓటు ప్రాముఖ్యాన్ని తెలియజేసేలా ఎలక్టోరల్ లిట్రసీ క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

మధ్యాహ్న భోజనం చేసేదెలా?

- ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు సన్నబియ్యం
- 9, 10 తరగతుల విద్యార్థులకు ఫోర్టిఫైడ్‌రైస్
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఒడిదొడుకులకు లోనవుతోంది. ఇప్పటికే మార్కెట్‌లో కోడి గుడ్డు ధర పెరగడంతో మధ్యాహ్న భోజనంలో పెట్టలేమంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దాదాపు అన్ని పాఠశాలల్లో కోడిగుడ్డు లేకుండానే భోజనం ఇస్తున్నారు. తాజాగా ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు సన్నబియ్యం, 9,10 తరగతి విద్యార్థులకు ఫోర్టిఫైడ్ రైస్ (సూక్ష్మపోషకాలతో కూడిన బియ్యం)తో మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉన్నత పాఠశాలలకు రెండు రకాల బియ్యాన్ని పంపించింది. ఇప్పటికే గుడ్డులేకుండా భోజనం చేసేందుకు ఇబ్బందిపడుతున్న విద్యార్థులు ఫోర్టిఫైడ్ రైస్ దొడ్డుగా ఉండడంతో వాటిని తినేందుకు ఇష్టపడటం లేదు. ముద్దగా మారుతున్న అన్నాన్ని బయటపడేస్తున్నారు.

● వండేందుకూ కష్టం

ఒకే పాఠశాలకు రెండు రకాల బియాన్ని సరఫరా చేయడంతో సన్నబియ్యంతో ఒకసారి, ఫోర్టిఫైడ్ రైస్‌తో మరోసారి.. ఇలా రెండుసార్లు అన్నం వండడం కష్టవుతోందని మధ్యాహ్నభోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూక్ష్మ పోషకాలతో కూడిన బియ్యం దొడ్డుగా ఉండడంతో తినలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. దీనితో సన్నబియ్యం అయిపోయే వరకు వాటిని వండి పెట్టి, ఆ తర్వాత ఫోర్టిఫైడ్ రైస్‌తో అందరికీ వండించి పెట్టడమే తప్ప చేసేదేమి లేదని కార్మికులు అంటున్నారు. 2015 జనవరి 1 నుంచి ఆనాటి ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లో సన్నబియ్యం (బీపీటీ)తో కూడిన మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేసింది. జిల్లాలో 647 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 42,532 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. వంట కార్మికులకు గౌరవ వేతనంతోపాటు కోడిగుడ్లకు అదనంగా నిధులు విడుదల చేస్తున్నారు. గురుకుల, ఆదర్శ, సంక్షేమ హాస్టళ్లలో వారంలో మూడు రోజులు కోడిగుడ్డుతో భోజనం ఇవ్వాల్సి ఉండగా కొన్ని పాఠశాలల్లో ఒకటి, మరికొన్నింటిలో వారంలో రెండు గుడ్లు మాత్రమే ఇస్తున్నారు. దీనితో విద్యార్థులు గుడ్డులేని భోజనం చేసేందుకు గతంలో మాదిరిగా ఆసక్తి చూపడం లేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోడి గుడ్డు ధరలను పెంచి కోడిగుడ్డుతో మధ్యాహ్న భోజనం తమ పిల్లలకు అందిస్తారని తల్లిదండ్రులు భావించారు. కాని 9, 10 తరగతులకు దొడ్డు బియ్యం పెడుతుండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఫోర్టిఫైడ్ రైస్‌తో వండిన అన్నం

గ్రానైట్ పరిశ్రమలో కలకలం

- అసోసియేషన్‌లో విభేదాలు
- ఎన్నికలు నిర్వహించాలని సభ్యుల డిమాండ్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ప్రభుత్వ మార్పు గ్రానైట్ పరిశ్రమలోనూ మార్పులకు దారితీస్తున్నదా అనే చర్చ జరుగుతోంది. ఇంతకాలం ఒక్కతాటిపై నడిచిన గ్రానైట్ అసోసియేషన్‌లో విబేధాలు భగ్గుమన్నాయి. అధ్యక్ష, కార్యదర్శుల తీరుపై అసోసియేషన్ సభ్యులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ అకౌంట్స్ సమర్పించి ఎన్నికలు జరిపించాలంటూ పట్టుబట్టడం గ్రానైట్ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. గురువారం కరీంనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం జరిగింది. గ్రానైట్ ఇండస్ట్రీలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన వారు ఉన్నారు. పరిశ్రమ అభివృద్ధి కోసం అధికారంలో ఏ పార్టీ ఉంటే వారితో గ్రానైట్ అసోసియేషన్ సత్సంబంధాలు పెట్టుకుంటుంది. గ్రానైట్ అసోసియేషన్‌కు మాజీ మంత్రి గంగుల కమలాకర్ బావ అయిన శంకర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఆయన సోదరుడి కుమారుడు ప్రదీప్ కార్యదర్శిగా ఉన్నారు. చాలా కాలంగా వీరే పదవిలో కొనసాగుతూ వస్తున్నారు.

నాయకత్వ మార్పు కోరుకుంటూ..

మారిన పరిస్థితులతో అసోసియేషన్‌లో గంగుల కుటుంబసభ్యుల నాయకత్వానికి వ్యతిరేకంగా ఉన్న కొందరు ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ముందుకు తెచ్చారు. ఈ అంశమే అసోసియేషన్ సమావేశంలో గొడవకు దారి తీసింది. దశాబ్దకాలంగా ఆదాయ వ్యయాల వివరాలు కూడా తెలుప లేదని, సభ్యుల ముందు లెక్కలు ఉంచాలని, ఎన్నికల షెడ్యూల్ తయారు చేయాలని సమావేశంలో సభ్యులు పట్టుపట్టినట్లు తెలిసింది. సభ్యులకు సమాచారం లేకుండా అధ్యక్షుడు ఒక్కరే హైదరాబాద్‌కు వెళ్లి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిరావడంలో అంతర్యమేమిటనీ నిలదీసినట్లు సమాచారం. సభ్యుల ప్రశ్నలకు ఎలాంటి జవాబు ఇవ్వకుండా సర్వసభ్య సమావేశంలో అకౌంట్స్ సమర్పిస్తానని, అప్పుడే ఎన్నికల గురించి కూడా చర్చిద్దామని చెప్పి అధ్యక్షుడు శంకర్ సమావేశం నుంచి లేచి వెళ్లి పోయారని తెలిసింది. ఇంత కాలం అసోసియేషన్ నేతలపై ఉన్న అసంతృప్తి ప్రభుత్వం మారడంతో బయటకు వచ్చిందని, గ్రానైట్ పరిశ్రమలో ఇది మార్పులకు దారితీసే పరిస్థితి ఉన్నదని భావిస్తున్నారు.



ప్రభుత్వం మారడంతో..

ఇన్నాళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో ఎన్నికల గురించి అసోసియేషన్ కార్యక్రమాల గురించి సభ్యులు పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గంగుల కమలాకర్ మంత్రి పదవికి దూరమయ్యారు. కరీంనగర్‌కు చెందిన పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికైన మంత్రి పదవిని చేపట్టారు. గతంలో ఈ ఇద్దరి మధ్య సఖ్యత ఉన్నా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో విబేధాలు భగ్గుమని తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు.

ముగిసిన ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

- పంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందులు
- కనిపించని ప్రజల భాగస్వామ్యం



మహాత్మానగర్‌లో ప్రజలు లేక వెలవెలబోతున్న గ్రామ సభ

తిమ్మాపూర్, ఫిబ్రవరి 15: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా గ్రామాల్లో పిచ్చి మొక్కలను తొలగించడం, ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడం, మురికి కాలువలు శుభ్రం చేయడం వంటి పనులు చేశారు.

ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు

గెజిటెడ్ అధికారులు సరిపడా లేకపోవడంతో ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. మండలంలో 23 గ్రామ పంచాయితీలు ఉండగా తహసీల్దార్ కె కనకయ్యకు, ఎంపీడీవో విజయ్ కుమార్, మండల వ్యవసాయాధికారి జె సురేందర్, మండల పశు వైద్యాధికారి సురేందర్‌రెడ్డికి రెండు గ్రామాల చొప్పున బాధ్యతలు అప్పగించారు. ఎంపీవో బి కిరణ్ కుమార్‌కు మూడు గ్రామాల బాధ్యలు అప్పగించారు. దీంతో అధికారులకు 'ప్రత్యేక' బాధ్యతలు భారంగా మారాయి.

కొన్ని చోట్ల నామమాత్రంగా..

కొన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ నామమాత్రంగా సాగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక అధికా రులు వీలును బట్టి గ్రామాల్లో పర్యటించడం, ఫోన్లలో ఆదేశాలను జారీ చేయడంతో కిందిస్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ కరువైంది. పారిశుధ్య పనులు చేసేందుకు నిధుల లేమి ఇబ్బందికరంగా మారింది. ప్రత్యేక అధికారులు లు, పంచాయతీ కార్యదర్శులకు జాయింట్ చెక్ పవర్ ఇవ్వటికి ఇవ్వక పోవడంతో నిధులు విని యోగించుకునే పరిస్థితి లేదు. చివరి రోజు గ్రామ సభ నిర్వహించి పారిశుధ్య కార్మికులను సన్మానించాలని ప్రభుత్వం ఆదేశిం చింది. చాలా గ్రామ సభల్లో ప్రజలు కనిపించ లేదు. ప్రత్యేక అధికారు లు, కార్యదర్శులు, సిబ్బంది మాత్రమే పాల్గొని పారిశుధ్య కార్మికులను సన్మానించి గ్రామ సభలను ముగించారు.



పదో తరగతి విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలి

కరీంనగర్ టౌన్,ఫిబ్రవరి 15: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందులు విద్యార్థులు సినిమాలు, సెల్‌ఫోన్లు పక్కనబెట్టి చదువుపై శ్రద్ధ పెట్టాలని డీఈవో డాక్టర్ సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావు విద్యార్థులకు సూచించారు. గురువారం కరీంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సవరాన్)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. అన్ని సబ్జెక్టుల ప్రశ్నలు క్షుణ్ణంగా చదవాలని సూచించారు.

ఫ్లవర్ బొకేల తయారీతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

నాబార్డ్ ఏజీఎం జయప్రకాష్

గన్నేరువరం, ఫిబ్రవరి 15: ఫ్లవర్ బొకేల తయారీతో మహిళలు ఆర్థికంగా అభి వృద్ధి సాధించవచ్చని నాబార్డ్ ఏజీఎం జయప్రకాష్ అన్నారు. మండలంలోని జంగపల్లిలో నాబార్డ్ సౌజన్యంతో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వశక్తి సంఘాల మహిళల కు ఫ్లవర్ బొకేల తయారీపై ఎంఈడీపీ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఏజీఎం జయప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తు తం మార్కెట్‌లో రకాల ఫ్లవర్ బొకేలకు మంచి డిమాండ్ ఉందన్నారు. వివిధ రకాల బొకేల తయారీపై 15 రోజుల పాటు 30 మంది స్వశక్తి సంఘాల మహిళలకు శిక్షణ అందించి, సర్టిఫికెట్‌లను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనవికాస గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యదర్శి సంపత్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ షకీల్, మనీషా, అనూష పాల్గొన్నారు.



ఫ్లవర్ బొకేల తయారీపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న నాబార్డ్ అధికారి

అంకురార్పణ.. శేషవాహన సేవ

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అంకురార్పణ జరిగింది. పాతబజార్ గౌరీ శంకరాలయం నుంచి శోభాయాత్రగా పుట్టమన్ను ఆలయానికి తీసుకవచ్చారు. అంతకుముందు శ్రీవారిని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకొని పూజలు చేశారు. ఉత్సవాల ఏర్పాట్లు, జరుగుతున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధ్యయనోత్సవ మండపంలో శ్రీదేవీ భూ దేవీ సమేత వేంకటేశ్వరస్వామికి సహస్ర కలశాభి షేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ధ్వజాధివాసం జరిగాయి. రాత్రి శ్రీవారు ఉభయ దేవేరులతో కలసి శేష వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిం చారు. శ్రీవారిని భక్తులు దర్శించి పులకించిపోయారు. సాంస్కృతిక కళా వేదికపై గాయకుడు, ఉత్సవాల కల్చరల్ ఆర్గనైజర్ సల్వాజి ప్రవీణ్ నేతృత్వంలో వివిధ మండళ్ల ఆధ్వర్యంలో భజనలు నిర్వహించారు.

గురువారం సాయంత్రం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సతీమణి రజిత స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు, నాగ రాజాచార్యులు, వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో వుడుతల వెంకన్న, కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ పురుమల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ పాల్గొన్నారు.

● నేటి కార్యక్రమాలు..

శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి గోమాత పూజ, యాగశాలాప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం. అనంతరం సూర్యప్రభవాహనసేవ, సాయంత్రం 6-30 గంటల నుంచి చంద్రప్రభ వాహనసేవ. ఉదయం, సాయంత్రం వేదికపై భజనలు, పారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.







అంకురార్పణ నిర్వహిస్తున్న అర్చకులు, మొక్కులు చెల్లించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్, శేషవాహనంపై స్వామివారి ఊరేగింపు పాల్గొన్న భక్తులు

దాడికి పాల్పడిన వ్యక్తుల రిమాండ్

చిగురుమామిడి,ఫిబ్రవరి15: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన ఎలకపల్లి రమేష్, ఎలకల పల్లి నవీన్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్ చేసినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. ఇదే గ్రామానికి చేందిన కండె సాయికిరణ్ అనే వ్యక్తితో ఎలకపల్లి రమేష్, ఎలకపల్లి నవీన్‌లు డబ్బులు విషయంలో గొడవకు దిగారు. కత్తితో సాయికిరణ్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి తండ్రి కండె మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన తొలిదశ ప్రజాహిత యాత్ర



సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బండి సంజయ్ ప్రజాహిత యాత్ర

సిరిసిల్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు అందిస్తున్న నిధుల లెక్కలు వినిపిస్తూ ప్రజాసమస్యలు తెలుసుకుంటూ ఎంతో ఉత్సాహంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర గురువారం ముగిసింది. కొండగట్టు అంజన్న దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి మేడిపల్లి వద్ద ప్రారంభించిన ప్రజాహిత యాత్ర రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారం అంజనేయస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలతో ముగించారు. చివరి రోజు తంగళ్లపల్లి మండ ల కేంద్రం నుంచి సిరిసిల్ల జిల్లా కేంద్రం మీదుగా అగ్రహారం వరకు కొనసాగింది. సిరిసిల్లలో కొండా లక్ష్మణ్‌బాపూజీ, చాకలి ఐలమ్మ, గాంధీ, అంబేద్కర్, చేనేత విగ్రహాలకు పూలమాలలు వేశారు. ముగింపు సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఆరు రోజుల పాటు రెండు నియోజకవర్గాల్లో 13 మండలాలు, రెండు మున్సిపాలిటీలు, 81 గ్రామాల్లో యాత్ర సాగింది.

● బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదు

ముగింపు సందర్భంగా బండి సంజయ్ విలేకరుల సమావేశంలో మాట్లా డారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదని, బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ మాకేందని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా 400 సీట్లు బీజేపీకి రాబోతున్నాయని వివరించారు. మోదీ హవాను తట్టుకోలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి బీజేపీని దెబ్బ తీసేందుకు విషప్రచారం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, మున్సిపల్ మాజీ చైర్మన్ అడెపు రవీందర్, అల్లాడి రమేష్, ఎర్రం మహేష్, బర్కం వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

వెల్గటూర్, ఫిబ్రవరి 15: కోటిలింగాల గోదావరిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లి మండలం మ్యాదరిపేటకు చెందిన బత్తిని కమల్‌గౌడ్ (27) అనే యువకుడు తనకు డాటా ఎంట్రీ ఆపరే టర్ ఉద్యోగం వచ్చిందని చెప్పి ఇంటి నుంచి రూ.70 వేలు, బంధువుల దగ్గర రూ.44,500 తీసు కొని ఈ నెల 13న మధ్యాహ్నం టీఎస్ 09ఇసి3725 నంబ రు గల స్కూటీపై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి తనకు వరుసకు అల్లుడైన ఆకుల పవన్‌కు తన మొత్తం డబ్బులు హ్యాక్ అయ్యాయని ఫోన్ చేసి చెప్పాడు. ఈ క్రమంలో బుధవారం కోటిలింగాల గోదావరిలో శవమై తేలాడు. తన దగ్గర ఉన్న డబ్బులు మొత్తం అయిపోవడంతో చేతిలో డబ్బులు లేకుండా ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక గోదావరిలో దూకి ఆత్మహత్య కు పాల్పడినట్లు మృతుని తండ్రి బత్తిని మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భవనం పైనుంచి పడి ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి15: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారు లోని డబల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయంలో శ్రీగాద భాస్కర్ అనే వ్యక్తి గురువారం భవనం మొదటి అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. అతన్ని కుటుంబీకులు, కాలనీవాసులు మండల కేంద్రంలోనీ ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో భాస్కర్ తన కుటుంబీకులతో కలిసి మొదటి అంతస్తులో నివాసముంటున్నాడు. భవనం బాల్కనీ నుంచి కిందకు చూస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

గంభీరావుపేట, పిబ్రవరి 15 : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామ సమీప వ్యవసాయ బావిలో దూకి లింగన్నపేటకు చెందిన బర్కుటం లక్ష్మి (65) అనే వృద్ధురాలు గురువారం ఆత్మహత్య చేసుకుంది. పోలీస్‌లు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగన్నపేటకు చెందిన లక్ష్మి భర్త ఎనమిదేళ్ల క్రితం చనిపోయాడు. ఉన్న ఒక కొడుకు మూగవాడు కావడంతో లక్ష్మి తరుచూ ఆవేదన చెందేది. కొడుకు గ్రామ సమీపంలో ఉన్న రైస్‌మిల్‌లో పనిచేస్తూ అక్కడే ఉండేవాడు. ఇంట్లో లక్ష్మి ఒంటరి జీవితం గడుపుతూ మనోవేదనతో మానసికంగా బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో లక్ష్మి మతిస్థిమితం కోల్పోయినట్లు ప్రవర్తించింది. ముస్తాఫనగర్ గ్రామ సమీపాన గల వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మృతురాలు మరిది భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

రైతు మృతిపై వీడని మిస్టరీ

● సీపీకి ఫిర్యాదు చేసిన మృతుడి కుటుంబ సభ్యులు



కొమురయ్య (ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 15, మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు పంబాల కొమురయ్య(55) తన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషయమై గురువారం తిమ్మాపూర్ రూరల్ సీఐ స్వామి, గన్నేరువరం ఎస్ఐ చందా నరసింహారావుతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించగా గురువారం సాయంత్రం వరకు పోస్టుమార్టం చేపట్టలేదు. గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయబావి నుంచి మోటారును బయటకు తీసేందుకు తన తండ్రిని తీసుకెళ్లాడని అక్కడే విద్యుదాఘాతంతో తన తండ్రి మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి కుమారుడు రాజశేఖర్ గురువారం సీపీకి ఫిర్యాదు చేశాడు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత మృతికి గల కారణాలను వెల్లడిస్తామని ఎస్ఐ చందా నరసింహారావు తెలిపారు. చట్టప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా సంచరిస్తున్న
యువకుడిని చితకబాదిన గ్రామస్థులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని వెన్గుమట్ల గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న అపరిచిత యువకుడిని పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా సభ్యుడు అనుకుని గ్రామస్థులు చితకబాదారు. అనంతరం గొల్లపల్లి పోలీసులకు అప్పగించారు. యువకుడు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక తిరుగుతున్నాడని పోలీసుల విచారణలో తేలడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సిద్ధిపేట జిల్లా జూలపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్(25) కొంతకాలంగా మతి స్థిమితం సరిగా లేక హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ పిచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఆరు నెలల క్రితం ఇంటిలో నుంచి అదృశ్యం కావడంతో యువకుడి తల్లిదండ్రులు అతని ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో వెన్గుమట్ల గ్రామంలో యువకుడు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గ్రామస్థులు గుర్తించారు. వారం రోజులుగా పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా గ్రామాల్లో సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. దీంతో గ్రామస్థులు పిల్లలను ఎత్తుకెళ్లే ముఠాకు సంబంధించిన దొంగ అనుకుని యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. బాధిత యువకుడిని విచారించగా అతని మానసిక స్థితి సరిగా లేదని గుర్తించారు. అతని తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై మాట్లాడుతూ వదంతులను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

వీణవంక,ఫిబ్రవరి15:మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ నజీర (20) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం... నజీర మానసిక స్థితి సరిగాలేక పోవడం, అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి షేక్ హైదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

వీణవంక,ఫిబ్రవరి 15: మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామ మానేరు వాగు నుంచి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా ట్రాక్టర్ ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్టు పోలీస్‌లు తెలిపారు.చల్లూరు గ్రామ చివరులో వాహనాలు తకిఖీలు చేస్తుండగా మాల్లారెడ్డిపల్లి గ్రామనికి చెందిన మేకల శ్రీనివాస్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తుండగా అతని పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.మండలంలో అనుమతులు లేకుండ అక్రమంగా ఇసుక రవాణ చేస్తే కటిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఏటీఎం దోపిడీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

● పరారీలో మరో ముగ్గురు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15: ఈ నెల 10న గోదావరిఖని గౌతమినగర్ హనుమాన్ గుడి వద్ద ఉన్న ఏటీఎంలో డబ్బులు దోచుకెళ్లిన ఘటనలో ప్రధాన నిందితుడు హకీముద్దీన్‌ను రామగుండం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ మేరకు రామగుండం సీఐ టీ ప్రవీణ్ కుమార్ అరెస్టు వివరాలను వెల్లడించారు. హర్యాన రాష్ట్రానికి చెందిన హకీముద్దీన్, సోకెంఖాన్, అమీర్‌ఖాన్, వసీంఖాన్‌లు ఈ నెల 10న అర్ధరాత్రి గౌతమినగర్‌లోని ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి అందులోని రూ.27,59,000లను దోచుకెళ్లారు. ఈ ఘటనపై రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని హర్యాన రాష్ట్రంలో నిందితులు పారిపోతుండగా హకీముద్దీన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్టు సీఐ తెలిపారు. మిగతా నిందితులు సోకెంఖాన్, అమీర్‌ఖాన్, వసీంఖాన్ పారిపోయారని, వీరిని పట్టుకోవడానికి బృందాలు గాలింపు చర్యలు చేస్తున్నట్టు తెలిపారు. నిందితున్ని పట్టుకోవడానికి కృషి చేసిన సిబ్బందిని పెద్దపల్లి డీసీపీ చేతన్ అభినందించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 15 : మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 22 మంది వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరొకరికి 7 రోజులు, ఇంకొకరికి 3 రోజుల వంతున జైలు శిక్షతో పాటు ముగ్గురికి కలిపి 6 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 19 మంది వాహనదారులకు 33,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

నివేదన



> భద్రాచలానికి వచ్చే మార్గంలో దుమ్ముగూడెం (దూమగూడెం) అనే ఊరు ఉంది. దాని అవతలి ఒడ్డున ఉన్న చిన్న గుట్ట సమీపంలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగినట్టు రామాయణంలో ఉంది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు శ్రీరాముడు అంత్య సంస్కారాలు చేశాడు.

పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరిపురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్ళారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్ళాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టే... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామలక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి...వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి, పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్మగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

• వనం జ్వాలా నరసింహారావు



నేడు రథసప్తమి

జగత్ చైతన్యకారకుడు

బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తీర్దివాకరః

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్పై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను ఆర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా... రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్ఠితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర


గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవింద రాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దెపైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

ఫిబ్రవరి 21 : కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.
ఫిబ్రవరి 22: చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
ఫిబ్రవరి 23: భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.
ఫిబ్రవరి 24: గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం.
ఫిబ్రవరి 28: తిరుగువారం పండుగ.



• నూతి శివానందం

అవధూత శిఖామణి

సేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
సేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద

"**శ్రీకృష్ణుడు** నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతో పాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

మార్గదర్శి

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే... కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్న్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాదాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన అపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.





శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషం

జ్ఞాన కార్యసాధకుడు

ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః



హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.

వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటానాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచీ చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకావ్యశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యా'న్ని రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా, భీముడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదేనని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.

• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

అల్ఫోర్స్‌లో ఫేర్‌వెల్ డే



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 15: అల్ఫోర్స్ హైస్కూల్, ఈ-టెక్నో స్కూల్ పదో తరగతి విద్యార్థులకు గురువారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నరేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



జాన్సన్ గ్లోబల్ పాఠశాలలో పూజలో పాల్గొన్న డైరెక్టర్లు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి15: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని జాన్సన్ గ్లోబల్, కోరా విద్యాసంస్థల డైరెక్టర్స్ అన్నారు. వసంత పంచమిని పురస్కరించుకొని వావిలాలపల్లి లోని జాన్సన్ గ్లోబల్ హైస్కూల్, కోరా విద్యాసంస్థలలో సరస్వతీ మాత విగ్రహానికి వేద పండితులచే పూజలు నిర్వహించారు. అనంతరం జాన్సన్ గ్లోబల్, కోరా, ఎస్‌వీజేసీ, విద్యాసంస్థల, డైరెక్టర్స్ ఊట్కూరు మైపాల్‌రెడ్డి, కాంతాల రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వెంకట వరప్రసాద్, వంగళ సంతోష్ రెడ్డితో పాటు ప్రిన్సిపాల్ జయప్రకాష్, హిందుజ, అనుజ్ఞ సరస్వతి అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు.

ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్‌కు ఐటీ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీకాంత్ గుర్రం మెహిత్ శ్రీవాత్సవ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15: ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్‌కు అత్యున్నత ఐటీ పురస్కారం లభించింది. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ 2011లో కరీంనగర్‌లో అడుగుపెట్టి ఐటీ, ఐటీ ఆధారిత సేవలను అందిస్తోంది. మెడికల్ కోడింగ్, హెల్త్‌కేర్ ఐటీ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఎక్లాట్ ఐటీ, ఐటీ ఆధారిత సేవల విస్తరణకు తొలి అడుగు వేసింది. ఎక్లాట్ చైర్మన్ డాక్టర్ సుధాకర్‌రావు పొల్సాని, సంస్థ స్థాపకులు, సీఈవో కార్తీక్ పొల్సాని, కో ఫౌండర్ సీఈవో స్నేహ పొల్సాని ముందు చూపుతో తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది. స్నేహ పొల్సాని సారథ్యంలో అడుగువేసిన కరీంనగర్ కార్యాలయం ఇప్పుడు 400 మంది ఉద్యోగులతో కళకళలాడుతోంది. కరీంనగర్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో 50శాతం మంది మహిళలే కావడం విశేషం. ఐటీ, ఐటీ ఆధారిత సేవలను రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించే లక్ష్యంతో విశేషంగా కృషిచేస్తున్న సంస్థలకు ప్రతి సంవత్సరం హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా ప్రతిష్ఠాత్మక పురస్కారం ఎక్లాట్ సొల్యూషన్స్‌ను వరించింది. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని తెలంగాణ ఐటీశాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ చేతుల మీదుగా సంస్థ ఇండియా టీడర్స్ శ్రీకాంత్ గుర్రం మెహిత్ శ్రీవాత్సవ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవింద్‌కుమార్‌తోపాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

రెండో విడత దళితబంధు డబ్బులు ఇప్పించండి

హుజూరాబాద్, ఫిబ్రవరి 15: హుజూరాబాద్ నియోజకవర్గంలో రెండో విడత దళితబంధు డబ్బులను ఇప్పించాలని గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీలో స్పీకర్‌ను కోరారు. నియోజకవర్గంలో దళితబంధు పైలెట్ ప్రాజెక్టు కింద రూ.18వేల దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10లక్షల చొప్పున అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 2800 కుటుంబాలకు రెండో విడత దళితబంధు డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరందించాలన్నారు. హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రిలో ఐసీయూ ప్రారంభోత్సవానికి తేదీని ప్రకటించాలన్నారు.

పవర్ లూమ్స్ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఫిబ్రవరి 15: పవర్ లూమ్స్ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన గర్షకుర్తి పవర్ లూమ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బతుకమ్మ చీరల తరహా గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లను కల్పించి పవర్ లూమ్స్ పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు. గర్షకుర్తిలో 2022లో 20లక్షల మీటర్లు,2023లో 30.26లక్షల బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లు,2లక్షల స్కూల్ యూనిఫాం బట్టల ఆర్డర్లు, రంజాన్‌కు 24 వేల మీటర్ల గుడ్డను బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్డర్లు ఇచ్చి చేనేతను ఆదుకుందన్నారు. ఆయన వెంట నాయకులు అలవాల తిరుపతి, సురేందర్‌రెడ్డి, పవర్‌లూమ్స్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 15: జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నించాడు. మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లిలో గల 431సర్వే నెంబర్‌లో ఖాళీగా ఉన్న జాగాపై కన్నేశాడు. అర్ధరాత్రి మున్సిపల్ కార్యాలయ ట్రాక్టర్లతో ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి కుంట నుంచి మొరం తరలించి ప్రభుత్వ భూమిని చదును చేసేందుకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు ట్రాక్టర్లను అడ్డుకుని ప్రభుత్వ భూమి చదును చేయడం ఏమిటని ప్రశ్నించారు. మరుసటి మళ్లీ మొరంతో చదును చేసే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకుని జిల్లా కలెక్టర్, సీపీకి ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ రజని విచారణకు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని కబ్జాకు ప్రయత్నించిన వారి వివరాలు సేకరించారు. ప్రభుత్వ భూమి కబ్జా చేయాలని చూస్తే సహించేది లేదని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

బాలికలకు ఎల్ఐసీ బాండ్స్ అందజేత

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువున్న బాలికలకు ఆర్థిక భరోసా కల్పించేలా మాజీ సర్పంచ్ కొడిగూటి శారద ప్రవీణ్ గొప్ప కార్యక్రమానికి చుట్టారు. పాఠశాలలోని 30 మంది బాలికల ఉండగా ఒక్కొక్కరి పేరు మీద రూ.5,500ల చొప్పున ఎల్ఐసి ఇన్సూరెన్స్ పాలసీ చేయించారు. గురువారం బాలికలకు ఎల్ఐసీ బాండ్స్‌ను అందజేశారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

హుజూరాబాద్, ఫిబ్రవరి 15: హుజూరాబాద్ పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొడిశెట్టి అభిలాష్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టులను గురువారం నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

బ్రహ్మోత్సవాల్లో చిగురుమామిడి కళాకారులు

చిగురుమామిడి,ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో మండలంలోని రేకొండ, సుందరగిరి గ్రామాలతో మరో కొన్ని గ్రామాలకు చెందిన కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టినట్లు కళాకారుల మండల కమిటీ అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్ తెలిపారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి



మాట్లాడుతున్న ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి15: శాతవాహన యూని వర్సిటీలోని లైబ్రరీ ఆవరణలో గురువారం ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య సంకశాల మల్లేష్ ప్రారంభించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జాఫర్ అధ్యక్షతన జరిగిన జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవాలాల్ గిరిజన జాతిని ఐక్యం చేశారన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ మాట్లాడుతూ మహనీయుల జయంతులను జరుపుకోవటం ద్వారా వారి జీవిత చరిత్రలను చదవటం ద్వారా మనం స్ఫూర్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ సంచాలకులు డాక్టర్ కే పద్మావతి, ఆర్ట్స్,సైన్స్ కామర్స్‌కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

●శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బంజారల ఆరాధ్య దైవం అని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ మహారాజులు విఠల్ మహారాజ్, భాస్కర్ మహారాజ్ మోహన్ నాయక్ నాయకులు ప్రేమ్ నాయక్, వినోద్ నాయక్, మహాలక్ష్మి, రంగా నాయక్, సుధాకర్ నాయక్, రవినాయక్, మోతిలాల్ నాయక్,బాలు నాయక్ సికిందర్ నాయక్, దన్ను మహారాజ్ జీడీ రమేష్, జీవన్ నాయక్ పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: నగరంలోని రేకుర్తి, మల్కాపూర్‌లో శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మేయర్ యాదగిరి సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై సేవాలాల్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ ఎదుల్ల రాజశేఖర్, బంజార కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, ఫిబ్రవరి15: నగరంలోని కార్ఖానగడ్డలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ క్లబ్ పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైరం కుమార్, ప్రధాన కార్య దర్శిగా మాడేపు హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా గొర్రె వాసు, కోశాధికారిగా కర్ర నవీన్‌కుమార్, క్రీడా కార్యదర్శిగా కొరివి సాయిప్రణీత్, కార్య నిర్వాహక కార్యదర్శిగా బత్తుల లక్ష్మణ్‌లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి కొరివి వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 18న నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు.

ముగిసిన జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, ఫిబ్రవరి15: జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్షలు గురువారం కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ముగిసినట్లు టీఎస్ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. పోస్టుల నియామకం పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. మొత్తం అభ్యర్థులు 27 మంది హాజరు కావాల్సి ఉండగా 24 మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ టీఎస్ ఎన్పీడీసీఎల్ నుంచి వచ్చిన పరిశీలకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నరేడ్ల' ఆశయాల సాధనకు కృషి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15: లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నిర్మాత, వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నరేడ్ల శ్రీనివాస్ ఆశయాల సాధనకు కృషి చేయాలని కరీంనగర్ వినియోగదారుల మండలి గౌరవ అధ్యక్షుడు ప్రకాశ్‌హోల్లా కోరారు. గురువారం స్థానిక ఫిలింభవన్‌లో కరీంనగర్ వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో నరేడ్ల శ్రీనివాస్ తృతీయ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కోల రాంచంద్రారెడ్డి, లక్ష్మణ్‌కుమార్, పందిల్ల శంకర్, దామోదర్, సయ్యద్ ముజఫర్, గంగాధర్, లక్ష్మారెడ్డి, రఘురామ్, కందుకూరి అంజయ్య, కెఎస్ నారాయణ, మహేందర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు సిల్వర్ మెడల్



మెడల్ అందుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 15: ఆల్ఇండియా పోలీస్ డ్యూటీమీట్‌లో కరీంనగర్ సీఐడీ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కాసుల శ్రీనివాస్ సిల్వర్ మెడల్ పొందారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 67వ ఆల్ఇండియా పోలీస్‌డ్యూటీ మీట్‌లో గురువారం జరిగిన వీడియోగ్రఫీ విభాగంలో శ్రీనివాస్ సిల్వర్ మెడల్‌తో రన్నర్ ట్రోఫీని సాధించాడు.

నగర సమగ్ర అభివృద్ధికి పాలకవర్గం కృషి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15: నగర అభివృద్ధే ధ్యేయంగా తమ పాలకవర్గం కృషి చేస్తూ రాష్ట్రంలోనే నంబర్‌వన్ నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం నగరంలోని 53వ డివిజన్ కాశ్మీరుగడ్డలో మేయర్ సునీల్‌రావు పర్యటించి కార్పొరేటర్ శ్రీదేవి చంద్రమౌళితో కలిసి నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.219 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ నేతృత్వంలో వందల కోట్లు తెచ్చి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసి నగర రూపురేఖలు మార్చామని అన్నారు. విలీన గ్రామాలు, శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి నిధుల లభ్యత మేరకు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తున్నామని అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 200 కోట్లను కేటాయించాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వ లేదన్నారు. ఆ నిధులు వస్తే పనులన్నింటిని పూర్తిచేస్తామని చెప్పారు. ఈకార్య క్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15: బాలల హక్కులను పరిరక్షించాలని మేయర్, బాలల పరిరక్షణ అర్బన్ కమిటీ అధ్యక్షుడు యాదగిరి సునీల్‌రావు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం మేయర్ సునీల్‌రావు అధ్యక్ష తన పట్టణ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం జరిగింది. భారత రాజ్యాంగం కల్పించిన బాలల హక్కులు, చట్టాల పూర్తి స్థాయిలో అమలు అయ్యేలా, బాలల పరిర క్షణ చేపట్టేలా నగరపాలక సంస్థ, జిల్లా సంక్షేమశాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, కార్మిక శాఖ, పోలీసు శాఖ, న్యాయశాఖ, మహిళా సమాఖ్య, డిసిపివో, సిడబ్ల్యూతో కూడిన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో డీఎంహెచ్‌వో, శిశు మహిళా సంక్షేమ, కార్మిక, పోలీసు, న్యాయ, వైద్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం టీం పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 15: సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం సీఐ సునీల్, ఎస్ఐ జ్యోష్ణలు అన్నారు. కరీంనగర్ లోని బిర్లా ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో గురు వారం సైబర్‌క్రైం పోలీసు అధికారులు విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాం, యూట్యూబ్, స్నాప్ సాట్ వంటి సామాజిక మాధ్యమాలతో తెలియని వ్యక్తులతో చాటింగ్‌లు చేస్తూ ఓటీపీలు చెప్పి మోసపోతు న్నారని అన్నారు. విద్యార్థులు, యువకులు ఎక్కువ శాతం మొబైల్స్ వినియోగిస్తారని ఈ సమయంలో తెలియని వ్యక్తులతో చాటింగ్ చేయవద్దని సూచించారు.

ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీలు ఇతరులకు చెప్పవద్దని వారు సూచించారు. మొబైల్‌కు వచ్చే గుర్తుతెలియని లింక్‌లను ఓపెన్ చేయకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వివిధ సామాజిక మాధ్య మాల ద్వారా, ఓటీపీలు చెప్పటం ద్వారా, గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్‌లకు, మెస్సేజ్‌లకు స్పందించటం మూలంగా ఎక్కు వ శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరాలతో మోస పోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, సైబర్ క్రైం కానిస్టేబుల్ వసీం అక్రం పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదు



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న దొంత రమేష్

హుజూరాబాద్,ఫిబ్రవరి15: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదన్నారు. భార్య, కూతురుతో సహా ఆత్మహత్య చేసుకుంటానని బెది రించి గెలిచిన నీకు పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. దమ్ముంటే రాజీనామా చేసి నీ భార్య బిడ్డలను అడ్డం పెట్టుకోకుండా గెలిచి చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొల్లూరి కిరణ్, కిరణ్‌రెడ్డి, సాయి, విష్ణువర్ధన్, రత్నాకర్‌రెడ్డి, లావణ్య, అప్సర్, శంకర్, రమేష్, అయిలయ్య, చంద్రశేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉనికికోసం ఆరోపణలు చేస్తే సహించేది లేదు

హుజూరాబాద్‌రూరల్: ఉనికి కోసం ఆరోపణలు చేస్తే సహించేది లేదని టీపీసీసీ మెంబర్ పత్తి క్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భార్య, బిడ్డను అడ్డం పెట్టుకొని సెంటిమెంట్ రాజకీయాలతో గెలిచిన వ్యక్తి.. తెలంగాణ ఉద్యమకారుడు, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, నాయకులు సాహెబ్ హుస్సేన్ ఉన్నారు.

● హుజూరాబాద్ రూరల్: తెలంగాణ ఉద్యమకారుడు, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చిల్లర ఆరోపణలు చేస్తే సహించేది లేదని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి ఉద్యమ నాయకుడిగా మొదలైన ప్రస్థానం.. వివిధ పదవులను అధిరోహించి పదవులకే వన్నె తెచ్చిన గొప్ప నాయకుడు పొన్నం ప్రభాకర్ అని అన్నారు. ఎమ్మెల్యే హోదాలో హుందాగా ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సందమల్ల బాబు, దుబాసి బాబు, బత్తిని రవీందర్‌గౌడ్ ఉన్నారు.

రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలి

జమ్మికుంట: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసి గెలువాలని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. గురువారం కాంగ్రెస్ నాయకులు వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. బ్లాక్ మెయిల్ చేసి గెలిచాడని, అలాంటి వ్యక్తికి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. మరో మారు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. సీనియర్ నాయకులు అరుకాల వీరేశలింగం, మొలుగూరి సదయ్య, కసుబోజుల వెంకన్న, ఎరబెల్లి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

వీణవంక: బీసీ నాయకుడు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో 35 సంవత్సరాల అనుభవంతో పార్లమెంటులో ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడిన వ్యక్తి పొన్నం అని అన్నారు. కార్యక్రమములో బీసీ యువజన సంఘం మండల అధ్యక్షులు మద్దుల ప్రశాంత్, పోతరవేన సతీష్, సంది సురేందర్‌రెడ్డి, నల్ల కొండాల్ రెడ్డి, నిమ్మల సమ్మయ్య, దూలం సమ్మయ్య గౌడ్, రజాక్, మర్రి రాజు, సునీల్, వంశీ, నరేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి కౌశిక్‌కు లేదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడడం మంచిదన్నారు. సమావేశంలో తిరుపతి, మహేష్, రమేష్ కుమార్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో వైద్య పరీక్షలు

తిమ్మాపూర్, ఫిబ్రవరి15: స్థానిక శ్రీ చైతన్య విద్యా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీచైతన్య డిఫెన్స్ అకాడమీ, స్పోర్ట్స్ అకాడమీలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. అగ్నిపథ్ ఆర్మీ, పారామిలిటరీ ఫోర్సెస్ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడిన సందర్భంగా అభ్యర్థులకు మెడికల్ ఫిట్‌నెస్ సంబంధించి 18రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. శరత్ మ్యాక్స్ విజన్ క్యూ, కేశవ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. సుమారు 278మంది అభ్యర్థులు పరీక్షలు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపాల్స్ శ్యాంసుందర్‌రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణ

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి, మొక్కజొన్న పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో ఏవో సునీల్‌కుమార్, ఏఈవో సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ రావుల అనిత పాల్గొన్నారు.

కోతకు వచ్చిన వెల్లుల్లి పంటను ఎత్తుకెళ్లిన దొంగలు

శంకరపట్నం, ఫిబ్రవరి 15: శంకరపట్నం మండలం కన్నాపూర్‌లో బుధవారం రాత్రి ఓ రైతుకు చెందిన వెల్లుల్లి పంటను దొంగలు ఎత్తుకెళ్లారు. రైతు గుండవేని శంకర్ తెలిపిన వివరాల ప్రకారం తన పొలంలో వ్యవసాయ బావి వద్ద వెల్లుల్లి పంట సాగు చేశాడు. మార్కెట్లో వెల్లుల్లి పంటలకు డిమాండ్ ఉండడంతో కోతకు వచ్చిన పంటను గుర్తు తెలియని వ్యక్తులు వెల్లుల్లి పంటను ఎత్తుకెళ్లారని రైతు ఆవేదన చెందాడు. పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు.

నేడు రథసప్తమి

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 15: సూర్యునికి ప్రీతికరమైన సూర్య జయంతిని రథసప్తమి పర్వదినంగా మాఘ శుద్ధ సప్తమి శుక్రవారం జరుపుకోనున్నారు. ఈ రోజున రథ సప్తమి నోము ఆచరించడం శ్రేయస్కరమని శాస్త్రం చెబుతుంది. సూర్యుని ద్వారా డి-విటమిన్ పుష్కలంగా లభిస్తుందనేది శాస్త్ర సమ్మతమైన విషయం. రథ సప్తమికి ముందు రోజు నూనె లేని పదార్థాలను భుజించాలి. రథ సప్తమి నాడు ఇంటి ముందు ముగ్గులు వేసి, ప్రమిదలను తలపై ధరించి నదీ తీరానికి వెళ్లి అందులో వదలాలి. ముత్తైదువ లు, బ్రాహ్మణులు, పెద్దల ఆశీస్సులను పొందాలి.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

కరీంనగర్, ఫిబ్రవరి 15: విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు దనపురి సాగర్ అన్నారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జలజారాణి, సంస్థ సంయుక్త కార్యదర్శి గోగురి శ్రీధర్‌రెడ్డి, రక్షన్, హిమసాయి, దేవి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా స్థాయి పోటీలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 15: కొత్తపల్లిమండలం చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గౌడ్స్ జిల్లా స్థాయి కథా, రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సిహెచ్ ఎస్ జనార్ధన్‌రావు, కార్యదర్శి కంకణాల రాంరెడ్డి, షరీఫ్ అహ్మద్, అడిగొప్పుల సదయ్య, కెఈ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 15: నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ (బీఐఎస్)పై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందజేశారు. ఈకార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.అప్పారావు, బీఐఎస్ ఎస్పి అభిసాయి, బిఐఎస్ రిసోర్సు పర్సన్ జి.ప్రభాకర్, మెంటర్ శ్రీవాణి పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 15: జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17, 18,19 తేదీల్లో నిర్వహించనున్న 52వ తెలంగాణ సీనియర్ మహిళలు, పురు షుల హ్యాండ్‌బాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ పోస్టర్ ఆవిష్క రణ కార్యక్రమంలో ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ సతీష్‌రెడ్డి, ఎస్‌వీజేసీ విద్యాసంస్థల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, హరికృష్ణ, లయోల విద్యాసంస్థల ప్రిన్సిపాల్ జోసఫ్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శి నమిలికొండ ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగుల శ్రీనివాస్, దుర్గం రాజు పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు.

'క్రైస్తవులపై దాడిని ఖండిస్తున్నాం'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 15: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని జన్వాడలో క్రైస్తవులపై ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్ అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన దేశం అన్ని కులాలకు, అన్ని మతాలకు నిలయమన్నారు. ఎవరైనా ఏమతం వారైనా ప్రచారం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో కరీంనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, జిల్లా ఇంచార్జీ మంద బాలయ్య, కొమురయ్య, అశోక్, లక్ష్మణ్, రాజేశ్, వినయ్ పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి15: అసెంబ్లీలో బీసీ కులగణను తీర్మానం ప్రవేశపెట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

చొప్పదండి మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు

చొప్పదండి, ఫిబ్రవరి 15: చొప్పదండి మున్సిపల్ కమిషనర్‌గా కె.నాగరాజు శుక్రవారం పదవీబాధ్యతలను చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శాంతికుమార్ తొర్రూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ కాగా ఆయన స్థానంలో నాగరాజు క్యాతన్‌పల్లి నుంచి బదిలీపై వచ్చారు.

● సంక్షిప్త సమాచారం..

● వీణవంక: మండలంలోని మామిడాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుద్దాల శోభారాణికి నేషనల్ ఇన్నోవేటివ్ శిక్ష రత్న్ పుర స్కారానికి ఎంపికైనట్లు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన నవీచారి గతివిద్యార్థ్ సమూహ సంస్థ ప్రకటించింది.

● తిమ్మాపూర్: రేణికుంట గ్రామంలో గ్రామ మహిళా సంఘ భవనంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ల్యాగల దేవేందర్‌రెడ్డి రూ.15వేల విలువ గల వాటర్ ప్యూరిఫైయర్‌ను వితరణ చేశారు.

● మానకొండూర్ : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో జరుగుతున్న జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులలో భాగంగా శుక్రవారం ఎక్స్‌ప్రెస్ ఫీడర్‌తో పాటు, శంషాబాద్ ఫీడర్‌లలో ఉదయం 10గంటల నుంచి 12 వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఫనీ హమ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు.

●జమ్మికుంట: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబి) ఎదుట బీఎస్పీ నాయకులు గురువారం ధర్నా, రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ప్రభుత్వం అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు.

● వీణవంక: మండల ఎంపీడీవోగా మెరుగు శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీవోగా పని చేసిన కొప్పు శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు.

●హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని బీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పెద్ద పాపయ్యపల్లిలోని నాగార్జున డెయిరీని సందర్శించారు.

● హుజూరాబాద్‌రూరల్: సిర్సపల్లి గ్రామానికి చెంది న ఆదర్శ రైతు వంగల వెంకట్‌రెడ్డి గురువారం రేడియో కిసాన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ రీజినల్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సన్మానించారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలం కరీంపేట గ్రామానికి చెందిన ముస్లీం కుటుంబం మహ్మద్ సర్దార్-షబానా దంపతులు సమ్మక్క-సారలమ్మకు తమ కుమారుడు షానవాజ్ ఎత్తు బంగారాన్ని తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు.

● ఇల్లందకుంట: ఈ నెల 16న తెలంగాణ బిల్డింగ్ అండ్ ఆదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయా లని జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, మండల ఉపాధ్యక్షుడు సారయ్య అన్నారు. గురువారం ప్రచారం నిర్వహించారు.

● చొప్పదండి: దేశవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించ తలపెట్టిన కార్మిక సమ్మె, గ్రామీణభారత్ బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రుక్మాపూర్‌లో ఉపాధిహామీ కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు.